ఎమ్మెల్యే పల్లా కృషితో రూ.11 కోట్లు మంజూరు

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 2 : ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి కృషితో జనగామ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం రూ.11 కోట్లు మంజూరు చేసింది. నియోజకవర్గంలోని జనగామ, బచ్చన్నపేట, నర్మెట, తరిగొప్పుల, చేర్యాల, కొమురవెళ్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాలకు ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్డు, డ్రైనేజీ కాల్వల నిర్మాణం కోసం 'కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రూరల్ రోడ్స్ అండ్ డ్రైన్స్ ఇన్ ఎస్సీ లోకాలిటీ' కింద 131 పనులకుగాను రూ.11 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవెలప్‌మెంట్ శాఖ నుంచి జనవరి 28న జీవో నంబర్ 78 జారీ అయింది. నిధుల మంజూరు కోసం గత సెప్టెంబర్ 4వ తేదీన ఇంజినీర్ ఇన్ చీఫ్‌కు ఎమ్మెల్యే పల్లా అభివృద్ధి పనుల ప్రపోజల్స్‌ను పంపించారు. దీంతో నియోజకవర్గంలోని ఎస్సీ కాలనీల ప్రజలు ఎమ్మెల్యే పల్లాకు కృతజ్ఞతలు తెలిపారు.

కళాకారులకు డప్పులు పంపిణీ చేస్తున్న మంచాల ఎల్లయ్య

జఫర్‌గఢ్‌లో కళాకారులకు డప్పుల పంపిణీ

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 2 : మండల కేంద్రంలోని డప్పు కళాకారులకు మాజీ ఎంపీటీసీ మంచాల ఎల్లయ్య ఆదివారం డప్పులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాకారులతో కలిసి స్థానిక అంబేద్కర్ సెంటర్‌కు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎల్లయ్య మాట్లాడుతూ ఈ నెల 7న హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లక్ష డప్పులు-వేల గొంతుల ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మార్పీస్ నాయకులు, డప్పు కళాకారులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులకు కేంద్రం నిధుల కోత

దేవరుప్పుల, ఫిబ్రవరి 2 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.50.65 లక్షల కోట్ల బడ్జెట్‌లో గ్రామీణ పేదలకు రాయితీలను తగ్గించిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సింరపు రమేశ్ ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులకు నిధులను సైతం తగ్గించిందని తెలిపారు. ప్రజలు కొనుగోలు శక్తిని పెంచే గ్రామీణ ఉపాధి హామీకి గత సంవత్సరం కేటాయించిన రూ.86 వేల కోట్లను మాత్రమే బడ్జెట్లో చూపించిందన్నారు. ఆహార భద్రతకు పెద్ద ఎత్తున కోత విధించిందని ఆయన విమర్శించారు. ప్రభుత్వ భూములు అమ్మకం ద్వారా రూ.10 లక్షల కోట్ల ఆదాయం సమకూర్చుకుంటామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించడం ఆందోళనకరమని రమేశ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా వ్యవసాయరంగానికి, ఉపాధిహామీ పనులకు నిధుల కేటాయింపు పెంచాలని డిమాండ్ చేశారు.

పుట్టిన రోజు వేడుకలను జరుపుకుంటున్న నీరటి ఆగయ్య

ఘనంగా వందేళ్ల పుట్టిన రోజు వేడుకలు

నర్మెట, ఫిబ్రవరి 2: ఆధునిక యుగంలో ఎప్పుడూ ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితిలో నిండునూరేళ్లు ఆరోగ్యంగా జీవించిన వ్యక్తి పుట్టిన రోజు వేడుకలను కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఇప్పలగడ్డ గ్రామానికి చెందిన నీరటి ఆగయ్య వంద సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా కుమారులు, కూతుర్లు, మనుమళ్లు, మనుమరాళ్లతో ఆదివారం పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. ఆగయ్యకు ఇద్దరు కుమారులు, ఏడుగురు కుమార్తెలున్నారు. వారి పిల్లలు అందరూ కలిసి సుమారు 70 మంది కుటుంబసభ్యుల మధ్య పుట్టిన రోజు వేడుకలను జరుపుకోవడం సంతోషకరంగా ఉందని ఆగయ్య తెలిపారు.

మృతుడి కుటుంబానికి మిత్రుల ఆర్థిక సాయం

లింగాల ఘనపురం, ఫిబ్రవరి 2: : మండలంలోని కళ్లెం గ్రామానికి చెందిన కిరణ్ ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో బాధిత కుటుంబానికి ఆదివారం బాల్య మిత్రులు చేయూతనందించారు. మృతుడి చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం 2001-2002లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి అండగా ఉంటామని భరోసానిచ్చారు.

వెల్దండలో మృతురాలి కుటుంబానికి ..

నర్మెట, ఫిబ్రవరి 2: మండలంలోని వెల్దండకు చెందిన మంచె మణెమ్మ(65) ఆదివారం మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న స్థానికులు కొండం మధుసూదన్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబసభ్యులకు రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బిజ్జ మురళి, ఏలూరి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

పండ్ల దుకాణంలో అగ్ని ప్రమాదం

మంటల్లో కాలుతున్న పండ్ల దుకాణం

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 2 : జనగామ పట్టణంలోని రైల్వే స్టేషన్‌కు సమీపంలోని రమేశ్ పండ్ల దుకాణంలో శనివారం అర్ధరాత్రి మంటలు చెలరేగాయి. షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం సంభవించినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ ఘటనలో షాపులోని రూ.30 వేల నగదుతో పాటు రూ.2 లక్షల 80 వేల విలువైన పండ్లు, డ్రై ఫ్రూట్స్ దగ్ధం అయినట్లు బాధితుడు రమేశ్ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

వాటర్ ట్యాంకుకు లీకేజీతో వృథాగా తాగునీరు

- నాసిరకంగా ఉండడంతో కూలుతుందని స్థానికులు ఆందోళన
- పట్టించుకోని అధికారులు

నర్మెట, ఫిబ్రవరి 2: మండలంలోని వెల్దండ వాటర్ ట్యాంకు కొద్ది రోజులుగా లీకవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మండల కేంద్రానికి వెళ్లే రహదారి పక్కనే నిర్మించిన వాటర్ ట్యాంకు లీకై రహదారి వెంట వెళ్లే వారిపై చిరుజల్లులుగా కురుస్తున్నది. సుమారు పది నెలలుగా ట్యాంకు నుంచి మంచినీరు బయటకు వస్తుండడంతో కూలుతుందోనని స్థానికులు, చుట్టుపక్కల వారు ఆందోళన చెందుతున్నారు. నిత్యం ఈ దారి గుండానే సం బంధిత అధికారులు, నాయకులు వెళ్తున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని పలువురు తెలిపారు. తాగు నీటి సమస్య పరిష్కారానికి గతంలో వాటర్ ట్యాంకు నిర్మించారు. అయితే నాణ్యత లేకపోవడం తో వాటర్ లీకైంది. పైకి ఎక్కడానికి మెట్లు, పైన రేలింగు పూర్తిగా కూలిపోయింది. దీనిపై సంబంధిత అధికారులు పరిశీలించి ట్యాంకుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరారు.

వాటర్ ట్యాంకు నుంచి లీకవుతున్న తాగునీరు (వృత్తంలో)

వాటర్ ట్యాంకుకు మరమ్మతుల చేయాలి

కొన్ని నెలలుగా వాటర్ ట్యాంకుకు లీకేజీ ఏర్పడి మంచి నీరు వృథాగా పోతున్నది. దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. మరోవైపు వాటర్ ట్యాంకు నాసిరకంగా ఉండడంతో కూలుతుందనే భయం నెలకొంది. సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి మరమ్మతులు చేయాలి.

-పుట్ట భిక్షపతి, స్థానికుడు, వెల్దండ

యాదవ సంఘం తిమ్మంపేట అధ్యక్షుడిగా రాజయ్య

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 2 : మండలంలోని తిమ్మంపేట గ్రామ యాదవ సంఘం నూతన అధ్యక్షుడిగా మంద రాజయ్య ఎన్నికయ్యారు. ఆదివారం నిర్వహించిన యాదవ సంఘం సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మంద రాజయ్య, ఉపాధ్యక్షుడిగా అబ్బరబోయిన పాప య్య, ప్రధాన కార్యదర్శిగా మార్క కుమారస్వామి, కార్యదర్శులుగా మంద రాజు, నూకల మధు, కోశాధికారిగా భాషబోయిన కొమురయ్యను ఎన్నుకున్నట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మంద రాజయ్య మాట్లాడుతూ యాదవ సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కురుమలకు ప్రాధాన్యమివ్వాలి

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 2 : స్థానిక సంస్థల ఎన్నికల్లో కురుమలకు జనాభా ప్రకారం రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని కురుమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జాయ మల్లేశ్, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒగ్గు రవి కోరారు. ఆదివారం డివిజన్ కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశానికి మేకల మల్లేశం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురుమ కులస్తులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని కోరారు. స్టేషన్ ఘన్‌పూర్ డివిజన్‌లో కురుమల సంఖ్య ఎక్కువ ఉన్నందున స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ పార్టీలు తగినన్ని సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షుడు ఆలేటి రాజు, మండల అధ్యక్షుడు ఒగ్గు రాజు, ప్రధాన కార్యదర్శి శేవల్ల కుమార్, ఉపాధ్యక్షులు చెట్టుకూరి రవి, కోశాధికారి ఏనుగుల వెంకటేశ్, ప్రచార కార్యదర్శి పెద్దిబాబు, సహాయ కార్యదర్శులు అమరాజు కుమార్, కోటి, తిరుపతి, చెట్టె వెంకన్న పాల్గొన్నారు.

మండల అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై పోరాటం : సీపీఐ

మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు జువారి రమేశ్

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 2 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 4న జనగామలో సీపీఐ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు జువారి రమేశ్ తెలిపారు. ఆదివారం మండలంలోని తమ్మడపల్లి(జీ) లో పార్టీ శ్రేణులతో కలిసి బహిరంగ సభ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. రమేశ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు కొనసాగిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేస్తున్నదని విమర్శించారు. దీంతో నిరుద్యోగం పెరు గుతున్నదని ఆయన వివరించారు. దీనికి వ్యతిరేకంగా సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బహిరంగ సభకు అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ యాకూబ్‌పాషా, ఖాజామియా, అన్నెపు విష్ణు, నూర్జహాన్, షమీనా బేగం, సాంబలక్ష్మీ, సజ్జన్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో నేటి 'ప్రజావాణి' రద్దు

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 2 : కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే 'ప్రజావాణి' కార్యక్రమాన్ని నేడు రద్దు చేసినట్లు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో జిల్లా అధికార యంత్రాంగం ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉందని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున జిల్లా ప్రజలెవరూ తమ సమస్యల పరిష్కారం కోసం వినతులను తీసుకొని కలెక్టరేట్‌కు రావొద్దని సూచించారు. కోడ్ ముగిశాక ప్రజావాణి నిర్వహిస్తారని తెలిపారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 2 : జిల్లాలో ఇంటర్మీడియట్ జనరల్ అండ్ ఒకేషనల్ కోర్సు చదివే ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సోమవారం నుంచి ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నట్లు డీఐఈవో కే జితేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 23 కేంద్రాల్లో 4714 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ నెల 3 నుంచి 22వ తేదీ వరకు నాలుగు విడుతల్లో ఈ ప్రాక్టికల్స్ జరుగుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు అభ్యర్థులు ఇంటర్ బోర్డు అధికారులను సంప్రదిం చాలని ఆయన సూచించారు.

డబ్బు ల కోసం బెదిరించిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు

కొత్తపల్లిలో మట్లాడుతున్న ముక్కెర రవికుమార్

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 2 : మానవ హక్కుల సంఘం అధ్యక్షుడినని చెప్పడమేగాక మా ఖర్చులకు రూ.2 లక్షలు ఇవ్వాలని బెదిరించిన వ్యక్తిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు మండలంలోని కొత్తపల్లికి చెందిన ముక్కెర రవి కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత నెల 26న ఇదే గ్రామానికి చెందిన పల్లెపాటి సోమిరెడ్డి అనే వ్యక్తి తాను మానవ హక్కుల సంఘం మండల అధ్యక్షుడినని, మా ఖర్చుల కోసం రూ.2 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారని రవికుమార్ వివరించారు. తాను డబ్బులు ఇవ్వనని తెలుపగా మరోసారి మానవ హక్కుల సంఘం సభ్యులను వెంట తీసుకొచ్చి విరాళం ఇవ్వాలని బెదిరించారని తెలిపారు. సోమిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన వివరించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు ఆటోడ్రైవర్లు మృతి

నాగరాజు (ఫైల్)

జనగామ చౌరస్తా/చిల్పూరు/పాలకుర్తి, ఫిబ్రవరి 2 : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు ఆటో డ్రైవర్లు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ఆదివారం ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ ధరావత్ విజయ్ కుమార్ (35) అక్కడికక్కడే మృతి చెందాడు. జనగామ డిపోకు చెందిన బస్సు, ఆటో ఢీకొనడంతో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ఈ సమయంలో ఆటోలో ప్రయాణికులెవరూ లేరు. మృతుడు విజయ్‌కుమార్ స్వస్థలం సిద్దిపేట జిల్లా దూల్మిట్ట మండలం కూటిగల్ శివారులోని రెడ్యా నాయక్‌తండా. ఇతడు ప్రస్తుతం హైదరాబాద్‌లో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి భార్య నీలతో పాటు కుమారుడు చరణ్, కూతురు అమ్ము ఉన్నా రు. జరిగిన ఘటనపై జనగామ అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం విజయ్‌కుమార్ మృతదేహన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నష్కల్ సమీపంలో..

ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన చిల్పూరు మండలం నష్కల్ సమీపంలో జరిగింది. స్థానిక ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్-హైదరాబాద్ హైవేపై మండలంలోని నష్కల్ బస్టాప్ వద్ద ఆటోను యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో హైదరాబాద్ నుంచి హనుమకొండకు వెళ్తున్న వరంగల్-1 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. సంఘటనలో ఆటోను నడుపుతున్న పాలకుర్తి మండలం బమ్మెరకు చెందిన వంగాల నాగరాజు(27) మృతి చెం దాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా నాగరాజు మృతికి బీఆర్‌ఎస్ పాలకుర్తి మండల నాయకులు దార శంకరయ్య, బత్తిని గోపాల్, జోగు గోపీ, జంపాల రాజు సంతాపం తెలిపారు.

జాన్‌వెస్లీతో జిల్లా నాయకులు

జాన్‌వెస్లీని కలిసిన సీపీఎం నాయకులు

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 2 : సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన జాన్ వెస్లీని ఆదివారం హైదరాబాద్‌లోని మాకినేని బసవపున్నయ్య భవన్‌లో పార్టీ జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. జాన్‌వెస్లీకి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కనకారెడ్డి, సభ్యులు బూడిద గోపి, బోడ నరేందర్, డీవైఎఫ్ఐ నాయకుడు కనకాచారి పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఖోఖో రెఫరీ రమేశ్‌కు సన్మానం

అంతర్జాతీయ ఖోఖో రెఫరీ రమేశ్‌ను సన్మానిస్తున్న అజీజ్‌ఖాన్

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 2 : హనుమకొండ స్పోర్ట్స్ అథారిటీలో ఖోఖో కోచ్‌గా పనిచేస్తున్న రమేశ్ ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన ప్రథమ ప్రపంచ ఖోఖో పోటీలకు రెఫరీగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆదివారం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం(జేఎన్‌ఎస్)లో రమేశ్‌ను హనుమకొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్ ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హనుమకొండకు చెందిన రెఫరీగా అంతర్జాతీయ స్థాయి రమేశ్ వ్యవహరించడం ఓరుగల్లు క్రీడారంగానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తోట శ్యాంప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లా ఖోఖో అసోసియేషన్ క్రీడాకారులతోపాటు రెఫరీలను ప్రోత్సహించడం మూలంగా అంతర్జాతీయ స్థాయి ఫలితాలు రావడం సంతోషదాయకమన్నారు. సన్మాన గ్రహీత, అంతర్జాతీయ ఖోఖో రెఫరీ రమేశ్ మాట్లాడుతూ.. లక్ష్యానికనుగుణంగా నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించడంతోనే అంతర్జాతీయ స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ హ్యాండ్ బాల్, రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శులు శ్యామల పవన్‌కుమార్, మహ్మద్ కరీం, తెలంగాణ ఖోఖో అసోసియేషన్ రెఫరీ బోర్డ్ చైర్మన్ కుసుమ సదానందం, నిర్వహణ కార్యదర్శి రమణ, ఖోఖో అసోసియేషన్ బాధ్యులు రాంబాబు, స్వప్న, సృజన్‌కాంత్, సారంగపాణి పాల్గొన్నారు.

శ్రీసాయిప్రీతంకు చెస్ ఫిడే రేటింగ్

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 2 : స్థాయి శ్రీ సాయి ప్రీతం చెస్ అంతర్జాతీయ ఫిడే రేటింగ్ సాధించాడు. ఫాతిమానగర్‌కు చెందిన కవిత-కృష్ణమూర్తి దంపతుల కుమారుడు శ్రీసాయి ప్రీతం సెయింట్ గ్యాబ్రియల్ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్నాడు. కోచ్ శ్రీకాంత్ వద్ద ఓనమాలు నేర్చుకొని ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని పెద్దాపురంలో నిర్వహించిన 13వ స్కూల్ గేమ్స్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని 1547 ఫిడే-ఏలో రేటింగ్ సాధించినట్లు వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి కన్నా తెలిపారు.

రూ.12.75లక్షల వరకు ఐటీ మినహాయింపు శుభ పరిణామం

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 2 : బడ్జెట్‌లో ఉద్యోగులకు రూ.12.75 లక్షల వరకు ఆదాయ పన్ను చెల్లింపు మినహాయించడం మంచి పరిణామమే అని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి అన్నారు. ఆదివారం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పన్ను మినహాయింపు ఇవ్వడం వల్ల ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూక్యా నరసింహనాయక్, కోశాధికారి మహ్మద్ సలీం పాషా, మారుపట్ల మల్ల య్య, కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కల సాంబరాజు, గుంటుక ఐలయ్య, వరంగ ల్ జిల్లా అధ్యక్షుడు భూక్యా కస్నానాయక్, సహాయ కార్యదర్శి పిట్టల సాంబయ్య, జనగామ జిల్లా అధ్యక్షుడు మట్టపెల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కవితా సంపుటి ఆవిష్కరణ

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 2: ప్రముఖ కవయిత్రి, ఉపాధ్యాయురాలు గట్టు రాధికా మోహన్ రచించిన 'కొత్త పొద్దు కోసం' కవితా సంపుటిలో సమాజంలోని సమకాలిన సమస్యలు ప్రతిధ్వనించాయని ప్రముఖ కవి పొట్లపల్లి శ్రీనివాస రావు అన్నారు. తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో హనుమకొండ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో ఆదివారం 'కొత్త పొద్దు కోసం' కవితా సంపుటిని ఆవిష్కరించారు. కవి యాకూబ్, కవి పెనుగొండ సరసిజ, వీఆర్ విద్యార్థిపాల్గొన్నారు.

విరాళం అందిస్తున్న గోనెల ఉపేందర్

ఆలయ నిర్మాణానికి రూ. లక్షా 116 విరాళం

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 2 : డివిజన్ కేంద్రంలోని తిరుమలనాథ స్వామి ఆలయ ఆవరణలో ఆంజనేయస్వామి గుడి నిర్మాణానికి మాజీ ఎంపీటీసీ గోనెల ఉపేందర్ ఆదివారం రూ.లక్షా 116 విరాళం అందించారు. ఆలయ నిర్మాణంలో తన సహకారం రావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అనంతరం ఆలయ అర్చకుడు రమణాచారికి విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో గోనెల లతా ఉపేందర్, ధరణి, రోహిత్, కుంభం నరేందర్, మధు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరిహారం పెంచాలి

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 2 : ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందిన గీత కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఎక్స్‌గ్రేషియా పెంచాలని గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి పట్టపూరి సదయ్యగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రమాదవశాత్తు గాయపడిన గీత కార్మికులకు రూ.4 లక్షలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. జిల్లా కేంద్రాల్లో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమితి మండల అధ్యక్షుడు మేరుగు నర్సింగం, నాయకులు దుద్దుల కొమురెల్లి, సమ్మయ్య, రమేశ్, లక్ష్మీనారాయణ, ఎల్లగౌడ్, పట్టపూరి దాసు, కృష్ణ, బుడిగె సురేశ్, రాజు, బాలయ్య, స్వామి, చంద్రమౌళి పాల్గొన్నారు.

నందను సన్మానిస్తున్న రజక సంఘం నాయకులు

జడ్జిని సన్మానించిన రజక సంఘం నాయకులు

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 2 : రాష్ట్ర హైకోర్టు జడ్జి సూరేపల్లి నందను రజక సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. స్టేషన్ ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన న్యాయ స్థానాన్ని నంద శనివారం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో రజక సంఘం నాయకులు పొన్న శ్రీనివాస్, పొన్న రవి ఆధ్వర్యంలో నందను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పొన్న భిక్షపతి, సత్యనారాయణ, రమేశ్, చందు, రాజేశ్, మధు, కుమార్ పాల్గొన్నారు.

శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్

దేవరుప్పుల, ఫిబ్రవరి 2 : ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడిగా ఈరుకుల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు గంగిశెట్టి ప్రమోద్‌కుమార్ ఆదేశానుసారం మండల అధ్యక్ష పదవికి ఈరుకుల శ్రీనివాస్ నామినేషన్ వేశారు. ఒకే నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవంగా శ్రీనివాస్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి మదంశెట్టి వరుధిని, పర్యవేక్షకులు గన్ను నరసింహులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం జిల్లా కార్యదర్శి గంగిశెట్టి అనూజ, ఆర్యవైశ్యమహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్ను నర్సింహులు, రీజియన్ చైర్మన్ పడకంటి రవీందర్, జిల్లా యూత్ అధ్యక్షులు గజ్జి సంతోష్‌కుమార్, వాసవీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు నాగమల్ల సోమయ్య పాల్గొన్నారు.

హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయం వద్ద విద్యార్థులు

విజ్ఞాన యాత్రకు తరలిన తిమ్మంపేట విద్యార్థులు

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 2 : మండలంలోని తిమ్మంపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు విజ్ఞాన విహార యాత్రకు ఆదివారం తరలివెళ్లారు. హనుమకొండలోని వేయిస్తంభాల దేవాలయం, జంతు ప్రదర్శనశాల భద్రకాళీ ఆలయం, వరంగల్‌లోని కాకతీయుల కోటను సందర్శించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం తిరుమలరాజు, పాఠశాల విద్యా కమిటీ మాజీ చైర్మన్ కుంబోజు మహదేవ్, ఉపాధ్యాయులు రామానుజన్, సుమతి, ఉషారాణి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

బచ్చన్నపేట, ఫిబ్రవరి 2: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై హమీద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పడమటికేశ్వాపూర్‌కు చెందిన శ్రీరాములు శ్రీనివాస్ (44) తనకున్న వ్యవసాయ బావి వద్ద మల్బరి తోటను సాగు చేస్తూ అక్కడే ఉంటున్నాడు. రోజు మాదిరిగా మల్బరి తోట పనికి వచ్చిన కూలీలు శ్రీనివాస్ ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉందని గమనించి పరిశీలించారు. అక్కడి పరిసరాలను పరిశీలించగా శ్రీనివాస్ విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని జనగామ ఏరియా హాస్పిటల్‌కు పోలీసులు తరలించారు. మృతుడి భార్య ఝాన్సీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తికి దేహశుద్ధి

సుబేదారి, ఫిబ్రవరి 2 : బాలుడి కిడ్నాప్‌కు యత్నించిన వ్యక్తిని స్థానికులు అడ్డుకొని కొట్టి, పోలీసులకు అప్పగించిన ఘటన ఆదివారం నయీంనగర్ మూడు చింతల్ వద్ద జరిగింది. హనుమకొండ పోలీసుల కథనం ప్రకారం.. కాగజ్‌నగర్‌కు చెందిన రిటైర్డ్ ఆర్మీ జవాన్ మతిస్థిమితం కోల్పోయి హనుమకొండలో కొంతకాలంగా రోడ్లపై తిరుగుతున్నాడు. ఈ క్రమంలో నయీంనగర్ మూడు చింతల ప్రాంతానికి చెందిన బాలుడు ఇంటి నుంచి రోడ్డుపైకి వచ్చాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న మతిస్థిమితం లేని రిటైర్డు ఆర్మీ జవాన్ బాలుడి చేయి పట్టుకోవడంతో కేకలు వేశాడు. స్థానికులు గమనించి రిటైర్డు ఆర్మీ జవాన్‌ను చితకబాది పోలీసులకు అప్పగించారు.

ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా మడికొండలో ర్యాలీ

మడికొండ, ఫిబ్రవరి 2 : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా మడికొండలో జాంబవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భారీగా డప్పు ర్యాలీ నిర్వహించారు. సినీ గేయ రచయిత మిట్టపల్లి సురేందర్ ఎస్సీ కాలనీ కమ్యూనిటీ హాల్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు డప్పు చప్పుళ్లతో ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలని ఫిబ్రవరి 7వ తేదీన చేపట్టే చలో హైదరాబాద్ లక్ష డప్పులు-వేల గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.